సాక్షి
విజయనగరం
మంగళవారం । 27 । జూన్ । 2023




అర్జీల పరిష్కారం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీ సంతృప్తికరంగా పరిష్కారమయ్యే వరకూ పర్యవేక్షించాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. -8లో



డీసీసీబీ ద్వారా సేవలు విస్తృతం

జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) సేవలను విస్తృతం చేయాలని మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. -8లో



విడిపోయిన ఏనుగుల గుంపు

కొమరాడ మండలంలోని ఎనిమిది గజరాజుల గుంపు సోమవారం విడిపోయింది. -8లో

న్యూస్‌రీల్

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: భారత ప్రభుత్వం ఏటా గణతంత్ర దినోత్సవం రోజున ప్రకటించే పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ సోమవారం తెలిపారు. కళలు, సాహిత్యం, విద్యారంగం, క్రీడలు, వైద్యం, సమాజసేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ప్రజా సంబంధాలు, పౌర సేవలు, వ్యాపారం–పరిశ్రమలు తదితర రంగాల్లో విశేష ప్రతిభ కనబరచిన యువత/వ్యక్తులు అర్హులని పేర్కొన్నారు. పద్మ అవార్డులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సిఫార్సుతో యువజన సర్వీసులశాఖ భారత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తుందన్నారు. అర్హత, ఆసక్తి గల వారు వచ్చేనెల 10వ తేదీలోగా ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్: 98499 13080ను కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

కుష్ఠువ్యాధిపై సర్వే



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

విజయనగరం ఫోర్ట్: కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు జిల్లాలో మూడు వారాలపాటు సర్వే నిర్వహిస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం కుష్ఠువ్యాధి సర్వేకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శ, నొప్పిలేని మచ్చలు ఉన్న వారిని గుర్తించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తామన్నారు. కుష్ఠు వ్యాధిని త్వరగా గుర్తించడం, మందులు క్రమంతప్పకుండా వాడడం ద్వారా వ్యాధిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, కుష్ఠు, క్షయనివారణ అధికారి డాక్టర్ ఎన్. సూర్యనారాయణ, డాక్టర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో 'టీహెచ్ఆర్'



అంగన్‌వాడీ అధికారులతో సమీక్షిస్తున్న జేసీ

విజయనగరం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో జూలై 15వ తేదీ నుంచి టీహెచ్ఆర్ (టేక్‌హోమ్ రేషన్) విధానం అమలులోకి రానుందని, ప్రణాళికాబద్ధమైన ఏర్పాట్లు చేసుకోవాలని జేసీ మయూర్‌అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కరోనా తర్వాత టీహెచ్ఆర్ మళ్లీ పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో తన చాంబర్లో ఐసీడీఎస్, సివిల్ సప్లై అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. చిన్నారులకు మూడు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అరకేజీ ఆయిల్ అందజేయాలని సూచించారు. వైఎస్సార్ సంపూర్ణపోషణలో భాగంగా చిన్నారులకు పౌష్టికాహారం, వైఎస్సార్ కిట్లను సకాలంలో పంపిణీ చేయాలన్నారు. ఎండీయూ వాహనాలతో ఆయా అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో వైఎస్సార్ కిట్లను, నెలవారీ అందజేసే అన్ని రకాల సరుకులు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని డీఎస్ఓ మధుసూదనరావును ఆదేశించారు. సమావేశంలో సివిల్ సప్లై డీఎం మీనా కుమారి, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, సీడీపీఓలు పాల్గొన్నారు.

జూలై నెలంతా 'జగనన్న సురక్ష' సేవలు

- వారం రోజులపాటు 'అమ్మఒడి'
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి బొత్స

విజయనగరం అర్బన్: ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువచేయాలన్న ఉద్దేశంతో చేపడుతున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం వచ్చే నెల చివరివారం వరకు కొనసాగుతుందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద మీడియాతో సోమవారం మాట్లాడారు. ముందుగా ప్రకటించిన 11 సేవలు కావాల్సిన వారిని గుర్తించే సర్వే ఈ నెల 30వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో చేపడతామన్నారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి సచివాలయాల పరిధిలో ధ్రువపత్రాలను మంజూరు చేస్తామని చెప్పారు.

వారంరోజులపాటు 'అమ్మఒడి'

పార్వతీపురం మన్యం జిల్లాలోని చినమేరంగిలో ఈ నెల 28న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 'అమ్మఒడి' పథకం నాలుగో ఏడాది నిధులను విడుదల చేస్తారన్నారు. వచ్చేనెల 7వ తేదీ వరకు ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో 'అమ్మ ఒడి' పథకం అందజేసే కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 80 లక్షల మంది విద్యార్థులకు పథక ప్రయోజనం చేకూరనందన్నారు.



ఇది పాచిపెంట మండలంలోని మోసూరు గ్రామానికి వెళ్లే మార్గంలో వట్టిగెడ్డపై రూ.7.60 కోట్లతో నిర్మించిన వంతెన. ఇది ప్రారంభానికి సిద్ధంగా ఉంది. గిరిశిఖర ప్రాంతంలో ఏడెనిమిది గ్రామాల ప్రజలకు మైదానానికి అనుసంధానంగా మారింది. వారంతా గతంలో వర్షాకాలం వచ్చిందంటే వట్టిగెట్టలోని కాజ్‌వేపై నుంచి దాటి రావడానికి నానాకష్టాలు పడేవారు. వరద వచ్చిందంటే బయటి ప్రాంతంతో కొన్ని రోజుల పాటు సంబంధాలు తెగిపోయేవి. అలాగే, కుంటాం నుంచి తుమ్మిగుడ్డికి వెళ్లే మార్గంలో రూ.1.93 కోట్లతో మరో కీలకమైన వంతెన నిర్మాణం పూర్తి చేసుకుంది.



ఇది సాలూరు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు పర్యాటక ప్రాంతమైన అరకును దరిదాపులకు తీసుకొచ్చిన రహదారి. ఇప్పటివరకూ సాలూరు ప్రజలు అరకు వెళ్లాలంటే విజయనగరం మీదుగా దాదాపు 140 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చేది. పాచిపెంట మండలంలో వేటగానివలస నుంచి శతాబి మీదుగా రూ.9.96 కోట్ల వ్యయంతో 14.5 కిమీ పొడవున నిర్మించిన ఈ రోడ్డు వల్ల సాలూరు నుంచి అరకు వెళ్లడానికి సుమారు 60 కిమీ దూరం ప్రయాణిస్తే సరిపోతుంది.

మార్చి నాటికి పనులన్నీ పూర్తి

పార్వతీపురం మన్యం జిల్లాలో ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూఈ, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద తలపెట్టిన రోడ్డు నిర్మాణ పనులన్నీ వచ్చే సంవత్సరం మార్చి నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో తరతరాల నుంచి రహదారి సౌకర్యం లేక సామాన్య జీవనానికి దూరంగా ఉన్న గిరిజనులకు కొత్తగా చేపట్టిన రోడ్లు వెలుగు జీవితాన్ని ప్రసాదించనున్నాయి. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా ఇలాంటి ప్రాంతాల్లో రోడ్లు నిర్మాణం చేపట్టే అవకాశాన్ని ప్రభుత్వం మాకు ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నాం.

– డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, ఎస్ఈ, పంచాయతీరాజ్ శాఖ

మరికొన్ని రోడ్లకు లైన్ క్లియర్...

పాచిపెంట మండలంలో మరికొన్ని కీలకమైన రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ నుంచి అనుమతులు లభించాయి. దీంతో నిర్మాణ పనులు ప్రారంభించడానికి అధికారులు చర్యలు చేపట్టారు.

- పాచిపెంట మండలంలోని వేటగానివలస నుంచి తంగ్లాం వరకూ 8 కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది. దీని నిర్మాణానికి రూ.6.28 కోట్లు మంజూరయ్యాయి.
- పాచిపెంట మండలంలోని వేటగానివలస–తంగ్లాం రోడ్డు నుంచి బొడ్డపాడు మీదుగా మూతుకూడు వరకూ 5.60 కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మించనున్నారు. రూ.6.14 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది.
- పాచిపెంట మండలంలోని రొడ్డవలస నుంచి కంకణాపల్లి వరకూ 1.70 కిలోమీటర్ల పొడవున తారురోడ్డు నిర్మాణానికి రూ.1.35 కోట్ల నిధులు మంజూరయ్యాయి.
- సాలూరు మండలంలోని దిగువ శెంబి నుంచి దిప్పలపాడు మీదుగా తోనాం వరకూ 6.5 కిమీ తారురోడ్డు వేసేందుకు రూ.6.20 కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభంకానున్నాయి.

కొండకోనల్లో ప్రగతి బాటలు

- నాడు నిర్లక్ష్యం
- నేడు సాకారం

- మావోయిస్టు ప్రభావిత పార్వతీపురం మన్యం జిల్లాలో ఇన్నాళ్లకు వెలుగు బాటలు
- కొత్త జిల్లాగా ఏర్పాటైన 14 నెలల్లోనే 60 రోడ్లు మంజూరు
- రూ.263 కోట్లతో సుమారు 271 కిమీ పొడవున తారురోడ్డు నిర్మాణానికి సన్నద్ధం
- 32 రోడ్లు, వంతెనల నిర్మాణ పనులు దాదాపుగా కొలిక్కి
- డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర, కలెక్టర్ నిషాంత్‌కుమార్ చొరవతో వేగవంతం
- మూడు రోడ్లు మినహా అన్నింటికీ చకచకా అటవీశాఖ అనుమతులు
- సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షలతో పనుల్లో ప్రగతి

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

గతంలో కనీవినీ ఎరుగని రీతిలో ఇప్పుడు గిరిశిఖర ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో కాలిబాటలుగా ఉన్న మార్గాలను తారురోడ్లుగా అభివృద్ధి చేయాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర తొలి నుంచీ కృషి చేస్తున్నారు. గతంలో వై.ఎస్.రాజశేఖరరెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ హయాంలో కొన్ని రోడ్లను మంజూరు చేయించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం శంకుస్థాపనలు, జీవోలకే పరిమితమైంది. మంజూరైన రోడ్లనూ పూర్తి చేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. మళ్లీ వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతే గిరిశిఖర గ్రామాలకు రోడ్ల నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న జిల్లాల పునర్విభజన నిర్ణయం కూడా గిరిజన గ్రామాల్లో కొత్త వెలుగులకు కారణమవుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పడిన తర్వాత 15 నెలల కాలంలోనే దాదాపు 60 రోడ్లకు అనుమతులు మంజూరయ్యాయి. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్ల అనుసంధాన ప్రాజెక్టు (ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూఈ) కింద దాదాపు రూ.263 కోట్లతో సుమారు 271 కిమీ పొడవున తారు రోడ్లు వేయడానికి ఉద్యమ ప్రాతిపదికన అధికారులు సన్నద్ధమయ్యారు. ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ చొరవ సత్ఫలితాలిస్తోంది.

అటవీ శాఖ అనుమతులు చకచకా...

గిరిశిఖర ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు కీలకం. వీటిని సాధించడానికి కలెక్టర్ నిషాంత్‌కుమార్ అవసరమైతే కేంద్ర అధికారులతోనూ తరచుగా సంప్రదిస్తున్నారు. 60 నిర్మాణ పనుల్లో మూడింటికి తప్ప దాదాపుగా అన్నింటికీ మార్గం సుగమమైంది. వాటిలో 32 నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగతా పనులను సెప్టెంబర్ నెల నాటికల్లా పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.



విశాఖ-రాయ్‌పూర్ జాతీయ రహదారి నుంచి కారాడవలస వరకు సాగుతున్న రోడ్డు నిర్మాణం

ముఖ్యమైన రోడ్ల ప్రగతి ఇలా...

- పాచిపెంట మండలంలో కుంటాం బీటీ రోడ్డు నుంచి తుమ్మిగుడ్డి వరకూ దాదాపు 6.90 కిమీ పొడవున రోడ్డు నిర్మాణం జరుగుతోంది. దీని అంచనా విలువ రూ.5.50 కోట్లు. ఒకప్పుడు కాలిబాట మాత్రమే ఉండే ఇక్కడ తారురోడ్డు 4 మీటర్ల వెడల్పున నిర్మిస్తున్నారు. నెల రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. ఇది పూర్తయితే అరకు వెళ్లడానికి పాచిపెంట నుంచి 36 కిమీ, సాలూరు నుంచి 50 కిమీ దూరం ప్రయాణిస్తే సరిపోతుంది.



ఆజూరు-పందిరిమామిడివలస రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- పాచిపెంట మండలంలో నీలంవలస నుంచి గుమ్మిడిగూడ వరకూ 6.80 కిమీ పొడవున 7.5 మీటర్ల వెడల్పున రోడ్డును నిర్మిస్తున్నారు. 4 మీటర్ల వెడల్పున తారురోడ్డు పనులు చేపట్టాల్సి ఉంది. దీని నిర్మాణ వ్యయం రూ.3.765 కోట్లు. ఈ రోడ్డు పనులు కూడా నెల రోజుల్లో పూర్తి కానున్నాయి.
- పాచిపెంట మండలంలోనే ఆజూరు నుంచి చాకిరాయివలస మీదుగా పందిరిమామిడివలస వరకూ ఒకప్పుడు కాలిబాట మార్గమే ఉండేది. రూ.2.24 కోట్లు అంచనా వ్యయంతో దాదాపు 3.80 కిమీ పొడవున 7.5 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తారువేసే పనులు మాత్రమే ఉన్నాయి.
- పాచిపెంట మండలంలోని వేటగానివలస నుంచి శతాబి మీదుగా అరకు రోడ్డు వరకూ కాలిబాట మాత్రమే ఉండేది. కనీసం ద్విచక్ర వాహనాలపై కూడా వెళ్లలేని పరిస్థితి. దీన్ని 7.5 మీటర్ల వెడల్పున 14.50 కిలోమీటర్ల పొడవున నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.9.96 కోట్లతో చేపట్టిన పనులను ఆగస్టు నాటికల్లా పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇది పూర్తి అయితే పాచిపెంట మండలం నుంచి అల్లూరు సీతారామరాజు జిల్లాలోని అరకు వెళ్లడానికి దగ్గరి మార్గం అవుతుంది.



కొండను తొలిచి నందా నుంచి పగులుచెన్నూరు వరకూ రోడ్డు నిర్మాణ పనుల దృశ్యం

- సాలూరు మండలంలోని నందా–పగులుచెన్నూరు రోడ్డు నుంచి చోర మీదుగా కొదమ వరకూ మూడు కొండల మీదుగా 10.80 కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో తలపెట్టిన ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం దాదాపు రూ.11.33 కోట్లను మంజూరు చేసింది. ఇప్పటివరకూ కొదమ గ్రామం నుంచి సాలూరు రావాలంటే ఒడిశా మీదుగా దాదాపు 60 కిమీ మేర ప్రయాణం చేయాల్సి వచ్చేది. రోడ్డు పూర్తి అయితే 25 కిమీ ప్రయాణిస్తే సాలూరు చేరిపోవచ్చు.
- సాలూరు మండలంలో విశాఖపట్నం–రాయ్‌పూర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 26)ని అనుసంధానించేలా 7.3 కిమీ పొడవున కారాడవలస వరకూ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.4.97 కోట్లతో చేపట్టిన ఈ పనులు ఆగస్టు నాటికి పూర్తి అయ్యే అవకాశం ఉంది.

ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం

- సభాస్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, కళావతి.
- చినమేరంగి పాలిటెక్నిక్ కళాశాల వద్ద హెలిప్యాడ్ సిద్ధం
- అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనే అవకాశం ఉండడంతో పక్కాగా ఏర్పాట్లు



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు

కురుపాం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 28వ తేదీ బుధవారం కురుపాం వేదికగా నాలుగో ఏడాది అమ్మఒడి పథకం నిధులు విడుదల చేసేందుకు రానున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. సభాస్థలం, పార్కింగ్, వీవీపీ గ్యాలరీ, హెలిప్యాడ్ ప్రదేశాన్ని కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, జేసీ ఆర్.గోవిందరావు, సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్, ఆర్డీఓ హేమలత, కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, కళావతి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురంమన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు తదితరులు సోమవారం పరిశీలించారు. కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాకు మొదటిసారిగా సీఎం వస్తుండడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉందని, ఆ మేరకు ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు.


సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా..

- ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 28వ తేదీ బుధవారం ఉదయం 8 గంటలకు తన నివాసం నుంచి బయలుదేరుతారు. గన్నవరం ఎయిర్‌పోర్టుకు 8.20కు చేరుకుంటారు.
- గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో 9.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు.
- అక్కడ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో 9.25 గంటలకు బయలుదేరి 10 గంటలకు కురుపాం నియోజకవర్గం చినమేరంగి పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- అక్కడి నుంచి 10.05 గంటకు బయలుదేరి రోడ్డు మార్గంలో 10.30 గంటలకు సభాస్థలం వద్దకు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సందర్శిస్తారు.
- 10.35 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు.
- 12.25కు హెలీప్యాడ్ వద్దకు చేరుకుని 12.55 వరకు స్థానిక నాయకులతో సమావేశం అవుతారు.
- ఒంటి గంటకు హెలికాప్టర్‌లో తిరిగి విశాఖపట్నం చేరుకుంటారు.

60 మందికి 'వైఎస్సార్ లా నేస్తం'



వైఎస్సార్ లానేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, యువన్యాయవాదులు

విజయనగరం అర్బన్: వైఎస్సార్ లా నేస్తం నిధులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో సోమవారం విడుదల చేశారు. కార్యక్రమాన్ని విజయనగరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి కలెక్టర్ నాగలక్ష్మి, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ లావణ్య, జూనియర్ న్యాయవాదులు తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదుల ఖాతాల్లో నెలకు రూ.5 వేలు చొప్పున 2023 ఫిబ్రవరి నుంచి జూన్ వరకు 5 నెలలకు సంబంధించిన నిధులను ప్రభుత్వం జమచేసిందన్నారు. జిల్లాలోని 60 మంది యువ న్యాయవాదులకు ఒక్కొక్కరికి రూ.25వేలు చొప్పున రూ. 15,00,000లు ప్రయోజనం చేకూరిందన్నారు.

మత్తుపదార్థాలతో భవిత అంధకారం

- మత్తుపదార్థాల రవాణా సమాచారాన్ని 14500కి అందించాలి
- విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించిన ఎస్పీ ఎం.దీపిక
- ఎస్ఈబీ ఆధ్వర్యంలో కోట వద్ద మానవహారం



మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే జీవితాలు ఛిద్రమవుతాయని, ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయని, భవిత అంధకారంగా మారుతుందని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విజయనగరం జిల్లా కేంద్రంలో సోమవారం విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాల విక్రయం, రవాణా, వినియోగించే వారి సమాచారాన్ని ఎస్ఈబీ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన 14500కి లేదా కమాండ్ కంట్రోల్‌కు సమాచారం అందించాలన్నారు. చెడు సహవాసాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తుపదార్థాలకు అలవాటు పడే యువత శారీరక రుగ్మతలకు లోనై, జ్ఞాపకశక్తి, విచక్షణ, విజ్ఞత కోల్పోయి, నేరాలకు పాల్పడుతూ, కేసుల్లో నిందితులుగా మారుతూ, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఎత్తుబ్రిడ్జి వరకూ ర్యాలీగా వెళ్లి మానవహారంగా ఏర్పడి, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ర్యాలీలో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు, ఎస్‌బీ సీఐ జి.రాంబాబు, ఎస్ఐలు భాస్కరరావు, రామగణేష్, ట్రాఫిక్ ఎస్ఐలు మహేశ్వరరాజు, త్రినాథరావు, వివిధ కళాశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్‌లు పాల్గొన్నారు.

జిల్లా రుణ ప్రణాళిక రూ. 9,065కోట్లు

- గతేడాది లక్ష్యాలకు మించి రుణాలు మంజూరు
- 106 శాతం మేర రుణాలు మంజూరు చేసిన యంత్రాంగం
- అభినందించిన మంత్రి బొత్స సత్యనారాయణ



రుణప్రణాళిక బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, కలెక్టర్ నాగలక్ష్మి, ఇతర శాఖల అధికారులు

విజయనగరం అర్బన్: జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.9,065 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం విడుదల చేశారు. కలెక్టర్ నాగలక్ష్మి అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది రూ.7,509 కోట్లతో రుణ ప్రణాళికను రూపొందించగా, సరాసరి 106.21 శాతాన్ని సాధించి అనేక రంగాల్లో శతశాతం లక్ష్యాలను సాధించినందుకు అధికారులు, బ్యాంకర్లను మంత్రి అభినందించారు. ఈ ఏడాది రుణప్రణాళికలో వ్యవసాయ రంగానికి రూ.5,823 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.1211 కోట్లు, ఇతర ప్రాధాన్యత రంగాలకు రూ.441 కోట్ల రుణాలు మంజూరు చేయాలన్నది లక్ష్యంగా పేర్కొన్నారు. నాన్ ప్రయారిటీ సెక్టార్ రుణాల కోసం రూ.1590 కోట్లను కేటాయించారన్నారు. వ్యవసాయాధారిత జిల్లా అయినందున గత ఏడాది కంటే విరివిగా రుణాలను అందజేసి రైతులకు చేయుతనివ్వాలని బ్యాంకర్లను కోరారు. జగనన్న కాలనీల లబ్ధిదారులకు విరివిగా రుణాలు అందజేయాలన్నారు. అన్ని రంగాల్లో రుణలక్ష్యాలు శతశాతం సాధించాలని సూచించారు. తొలుత కలెక్టర్ నాగలక్ష్మి గత ఏడాది లక్ష్యాలపై సమీక్షించారు.

వ్యవసాయ అనుబంధ రంగాలకు, ఎంఎస్ఎంఈలకు రుణమంజూరులో ప్రాధాన్యమివ్వాలని బ్యాంకర్లకు సూచించారు. మహిళలకు పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. బ్యాంకర్లు రుణాలను త్వరగా మంజూరు చేస్తే యూనిట్లు గ్రౌండింగ్ అవుతాయన్నారు. మార్జిన్‌మనీ కూడా త్వరగా విడుదల చేయాలన్నారు. కౌలు రైతులకు రుణాలతో పాటు అన్నిరకాల లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా లీడ్ బ్యాంకుమేనేజర్ శ్రీనివాసరావు, ఆర్‌బీఐ ప్రతినిధి, అన్ని బ్యాంకులకు చెందిన అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జర్మనీలో స్టాఫ్ నర్స్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, టీఏకేటీ ఇంటర్నేషనల్-ఏపీఎస్ఆర్టీఎస్ ఆధ్వర్యంలో జర్మనీలో స్టాఫ్‌నర్స్ (మహిళలు) ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నీలం గోవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసి 20 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి, సాధారణ ఆస్పత్రుల లో రెండేళ్ల అనుభవం కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు విజయవాడలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో 2 నెలల పాటు నిర్వహించే బీ1 స్థాయి జర్మన్ భాష శిక్షణ కోసం ఉచిత తరగతులకు హాజరు కావాలని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికయ్యే అభ్యర్థినులకు విమాన చార్జీలు, ఆహారం, వసతి ఆరు నెలల పాటు ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. నెలకు 1000 యూరోల జీతం చెల్లిస్తారన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9988853335, 7730088258 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బాలుడి అదృశ్యం


అల్బిన్ రాజ్

రాజాం సిటీ: స్థానిక మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన అల్బిన్ రాజ్ (15) అదృశ్యంపై కేసు నమోదుచేశామని సీఐ కె.రవికుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల 25న ఉదయం 10 గంటల నుంచి కనిపించకపోవడంతో అంతటా వెతికినప్పటికీ ప్రయోజనం కనిపించకపోవడంతో తండ్రి జోసెఫ్‌రాజ్ ఫిర్యాదు చేసిన మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: గరివిడి మండలం వెదుళ్లవలసకు చెందిన బంకపల్లి శివ (26) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రెండేళ్లుగా శివ కాకినాడ పోర్టులో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నాడు. ఈ నెల 6వ తేదీన ఇంటికి వచ్చాడు. 12వ తేదీన కాకినాడ వెళ్లిపోతున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. స్థానిక సంతకాల బ్రిడ్జి కిందికి వచ్చి గడ్డి మందు తాగి తన స్నేహితుడికి ఫోన్ చేసి రమ్మీ యాప్‌లో డబ్బులు పోగొట్టుకుని అప్పులపాలయ్యాయని, తాను గడ్డిమందు తాగానని చెప్పి మళ్లీ బస్సు ఎక్కి చీపురుపల్లి వెళ్లాడు. అప్రమత్తమైన స్నేహితుడు శివను చీపురుపల్లిలోని ఆస్పత్రికి తరలించాడు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విజయనగరం కేంద్రాస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని తల్లి తవుడమ్మ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై మురళి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చకామెర్లతో ఉపాధ్యాయుడి మృతి


ఉపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు (ఫైల్)

సీతంపేట: మండలంలోని పొల్ల గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు వాన ఉమామహేశ్వరరావు(36) పచ్చకామెర్లతో బాధపడుతూ శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో సోమవారం మృతిచెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పాఠశాలల పునఃప్రారంభం అనంతరం ప్రతిరోజూ పాఠశాలకు వచ్చారు. వ్యాధి తీవ్రం కావడంతో శ్రీకాకుళం జెమ్స్‌లో చికిత్స నిమిత్తం సోమవారం చేరారు. చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన స్వగ్రామం వీరఘట్టం మండలం ఎం.రాజపురం. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉపాధ్యాయుడి మృతి పట్ల గిరిజన సంక్షేమశాఖ డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీఈవో లిల్లీరాణి, పాఠశాల హెచ్‌ఎం మీనక భాస్కరరావు, ఏఎంవో కోటిబాబు, ఉపాధ్యాయులు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,180-00
బంగారం(22సి. 10గ్రా.)	54,350-00
వెండి (కిలో)	75,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹ 250

సంతృప్తికరంగా అర్జీల పరిష్కారం

- ప్రతి రోజూ పర్యవేక్షించాలి
- పెండింగ్ వినతులపై కలెక్టర్ సమీక్ష


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ దీపిక

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీ సంతృప్తికరంగా పరిష్కారమయ్యే వరకూ అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆయా వినతులు ఏదశలో పరిష్కారంలో ఉన్నాయనే అంశాన్ని ప్రతిరోజూ సమీక్షించుకుని అర్జీదారుల సంతృప్తిమేరకు వినతిని ఏవిధంగా పరిష్కరించవచ్చో కిందిస్థాయి సిబ్బందికి సూచనలు చేయాలని చెప్పారు. ఏ విధమైన దర్యాప్తు లేకుండా ఏ ఒక్క వినతిని ఆదరాబాదరాగా పరిష్కరించినట్లు మూసివేయవద్దని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అధికారులంతా సీరియస్‌గా తీసుకుని తమ కిందిస్థాయి సిబ్బంది అర్జీల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకునేలా వ్యక్తిగత శ్రద్ధ చూపాలని హితవు పలికారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై కలెక్టర్ సోమవారం జిల్లా అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. గత వారంలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి అసంతృప్తి వ్యక్తమైన వినతులపై ఆయా శాఖల అధికారులను వివరణ అడిగారు. దాదాపు 18 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 44 వినతులపై ఒక్కో శాఖ అధికారి నుంచి ఆయా వినతులు సంతృప్తికరంగా పరిష్కారం కాకపోవడానికి కారణాలు తెలుసుకున్నారు. కొన్ని ప్రభుత్వ శాఖలు తమకు సంబంధంలేని వినతులు వచ్చినపుడు వాటిని తిప్పి పంపకుండా పెండింగ్‌లో ఉంచుతున్నామని, దీనివల్ల ఆయా వినతులపై ఎలాంటి చర్యలు చేపట్టే అవకాశం ఉండడం లేదని చెప్పారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో తమకు సంబంధంలేని వినతిని వేరే శాఖకు పంపించకుండా జాప్యంచేసిన ఇంజినీరింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఎస్ఈని కలెక్టర్ ఆదేశించారు.

వినతుల పరిష్కారంతో పెరిగిన సంతృప్తి

ప్రతి వినతిని అధికారులు వ్యక్తిగత శ్రద్ధతో పరిశీలిస్తే చాలా వరకు సమస్యలు సంతృప్తికరంగా పరిష్కరించవచ్చని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. గత వారం కంటే ఈ వారంలో అసంతృప్తి వ్యక్తమైన వినతుల సంఖ్య బాగా తగ్గిందని అధికారులు, సిబ్బంది మరింత శ్రద్ధచూపితే ఈ సంఖ్య ఇంకా తగ్గించవచ్చన్నారు. సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి అంతర్ జిల్లా బదిలీలను మంగళవారం సాయంత్రానికి పూర్తిచేసి ఉత్తర్వులు సిద్ధం చేయాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

'జగనన్నకు చెబుదాం'కు 303 వినతులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి 303 వినతులు అందాయి. కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్‌డీఓ. ఎంవీ సూర్యకళ, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు పద్మలత, సూరకరాజు, సులోచన రాణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తదితరులు వినతులు స్వీకరించారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎం.దీపిక స్పష్టం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి 44 ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం చేయాలని, తీసుకున్న చర్యలను తనకు నివేదించాలని ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్, ఎస్బీ సీఐ జి.రాంబాబు, డీసీఆర్‌బీ ఎస్సై వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ద్వారా సేవలు విస్తృతం


మెరకముడిదాంలో డీసీసీబీ బ్రాంచి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

- 20వ బ్రాంచ్‌ను ప్రారంభించిన మంత్రి బొత్స

చీపురుపల్లి: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) ద్వారా ఖాతాదారులకు మరిన్ని సేవలు విస్తృతం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మెరకముడిదాం మండల కేంద్రంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(20) బ్రాంచ్ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి మండలంలోనూ డీసీసీబీ బ్రాంచి కార్యాలయాలు ప్రారంభించాలని సూచించారు. ఆయా మండలాల్లో ప్రజలు, ఖాతాదారులు, వ్యాపార అవసరాలు దృష్టిలో ఉంచుకుని ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగా కొత్త శాఖలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే స్వయం సహాయక సంఘాలను డీసీసీబీ బ్యాంకులకు అనుసంధానం చేసి వారికి విరివిగా రుణ సదుపాయం కల్పించాలని సూచించారు. జిల్లాలో ఇంకా ఎక్కెడెక్కడ కొత్త శాఖలు ఏర్పాటు చేస్తున్నారని సంబంధిత అధికారులను ప్రశ్నించారు.

రూ.100 కోట్ల టర్నోవర్

దీనికి డీసీసీబీ సీఈఓ జనార్దన్ మాట్లాడుతూ జిల్లాలో మరో ఐదు కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే 20 బ్రాంచిలు ఉన్నాయని చెప్పారు. అన్ని బ్రాంచిల్లోనూ దాదాపు రూ.100 కోట్ల టర్నోవర్ జరుగుతోందన్నారు. అనంతరం మెరకముడిదాం బ్రాంచి పరిధిలో ఐదు స్వయం సహాయక సంఘాలకు రూ.10 లక్షలు చొప్పున రూ.50 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకటచిన రామునాయుడు, ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వీ.రమణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడ్డి వేణు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్, కేఎస్‌ఆర్‌కే .ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.గుర్రాజు, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఆర్‌డీఓ ఎం.అప్పారావు, తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీఓ రత్నం, డీసీసీబీ జీఎం కె.చంద్రశేఖర్, డీజీఎం సీహెచ్.ఉమామహేశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ కేఏ.నాగరాజు, నోడల్ అధికారి పి.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

యువ న్యాయవాదులకు ఆర్థిక భరోసా

- డీఆర్‌ఓ వెంకటరావు


యువన్యాయవాదులకు నమూనా చెక్కును అందజేస్తున్న డీఆర్‌ఓ వెంకటరావు

పార్వతీపురం: యువ న్యాయవాదులకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అన్నారు. ఈ మేరకు సోమవారం వైఎస్సార్ లా నేస్తం నాల్గవ విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఆర్‌ఓ వెంకటరావు మాట్లాడుతూ కొత్తగా న్యాయవాద వృత్తిలో ప్రవేశించిన 12మంది న్యాయవాదులకు ఈ పథకం ద్వారా రూ.2.40 లక్షలు జమచేశారని తెలిపారు. ఈ మేరకు వారికి ఆర్థిక భరోసా కలుగుతుందని లైబ్రరీ, రవాణా, ఇతర అవసరాలకు ఎవరి మీద ఆధార పడకుండా మూడేళ్లు వారి ప్రాక్టీసును అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన యువ న్యాయవాదులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు జి.శరత్, కె.శ్రీధర్, జి.రాజ్‌కుమార్, పి.లావణ్య, టి.మౌనిక, శిరీష తదితరులున్నారు.

వృద్ధుల సంరక్షణ కోర్సుల్లో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: వృద్ధుల సంరక్షణ (ఎల్డర్లీ కేర్ టేకర్) కోర్సుల్లో 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు సోమవారం ఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో పదోతరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన 18-35 సంవత్సరాల మధ్య వయసున్న పురుష, స్త్రీ అభ్యర్థులు అర్హులన్నారు. ఇంటర్మీడియట్ బైపీసీ పాసైన వారికి 9 పారామెడికల్, డిప్లమో కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్:76809 45257, 79950 13422 నంబర్లను సంప్రదించాలని కోరారు.

దీనావస్థలో చిన్నారి

- చచ్చుబడిన కాళ్లూచేతులు
- పింఛన్ ఇప్పించాలని ఐటీడీఏ అధికారులకు వేడుకోలు


నిలబడలేని స్థితిలో దుర్గారావు

సీతంపేట: రెక్కాడితే గాని డొక్కాడని ఆ కుటుంబానికి పెద్ద కష్టం వచ్చింది. ఏం చేయాలో తెలియని స్థితిలో కొట్టుమిట్టాడుతోందా నిరుపేద గిరిజన కుటుంబం. సీతంపేట ఏజెన్సీలోని చాకలిగూడ గ్రామానికి చెందిన సవర సరోజిని, భాస్కరరావులు కూలి చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి రెండో సంతానంగా పుట్టిన దుర్గారావుకు ఐదున్నరేళ్లు. చిన్నప్పటి నుంచి కాళ్లూచేతులు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతూ పెంచుతున్నారు. వారి కుమారుడు లేచి నిలబడలేడు. మాట్లాడడు కేవలం పాలు, రొట్టె మాత్రం దగ్గరుండి పెడితే తింటాడు. బాబును చూసుకుని కాపలాగా ఇంటివద్ద ఉండడంతో పనులకు కూడా వెళ్లలేని పరిస్థితిలో ఉన్నామని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. తమ కుమారుడికి గతేడాది ప్రభుత్వం గుర్తించి వీల్‌చైర్ ఇచ్చిందని, ఎదుగుదల లేక నీరసిస్తున్న కుమారుడిని ఆదుకోవాలని కోరుతున్నారు. దివ్యాంగ పింఛన్ అయినా ఇప్పించాలని తల్లి సరోజిని ఐటీడీఏ అధికారులను వేడుకుంది. దీనికి స్పందించిన పీవో కల్పనాకుమారి సదరం సర్టిఫికెట్ వచ్చిన తర్వాత పింఛన్ ఇప్పించే ఏర్పాటు చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్


వినతులను స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురం: జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో ప్రజలు అందజేసిన వినతులకు సంతృప్తికర పరిష్కారం, సకాలంలో చూపించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావులతో కలిసి ప్రజల నుంచి 70 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ బి.జగన్నాథ రావు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎ.ఈశ్వర రావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్, పీఆర్ ఎస్ఈ ఎంవీజీ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఒ.ప్రభాకర రావు, హౌసింగ్ పీడీ పి.రఘురాం, డీఈఓ ప్రేమ్‌కుమార్, డ్వామా పీడీ కె. రామ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పేలిన బ్రేకర్

- సుమారు రూ.11 లక్షల నష్టం


సబ్‌స్టేషన్‌లో మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. సబ్‌స్టేషన్‌లో 11 కేవీ ఎల్‌వీ బ్రేకర్ పేలడంతో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సబ్‌స్టేషన్ సిబ్బంది వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది చేరుకుని మంటలు అదుపుచేశారు. బ్రేకర్ లింబు తప్పి విద్యుత్ ప్రవహించే వైరుపై ఒక్కసారిగా పడడంతో 11కేవీ ఎల్‌వీ బ్లాస్ట్ అయ్యిందని విద్యుత్ శాఖ ఏఈ పిచ్చయ్య తెలిపారు. ఈ ఘటనలో సుమారు రూ.11 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని చెప్పారు. గ్రామానికి విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకం లేకుండా వెంటనే నెల్లిమర్ల పట్టణ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేశామన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు తెలియజేశామని, రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపడతామని వెల్లడించారు. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

విడిపోయిన ఏనుగుల గుంపు


మార్కొండపుట్టి పరిసరాల్లో సంచరిస్తున్నచ గజరాజుల గుంపు


దుగ్గి పరిసరాల్లో సంచరిస్తున్న ఒంటరి ఏనుగు

కొమరాడ: మండలంలోని ఎనిమిది గజరాజుల గుంపు సోమవారం విడిపోయింది. మార్కొండపుట్టి పరిసర ప్రాంతాల్లో ఏడు ఏనుగులు, ఒంటరి ఏనుగు దుగ్గి గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఒంటరి ఏనుగుపట్ల అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది సూచిస్తున్నారు. ఏనుగులు కనబడినపుడు కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని చెబుతున్నారు. రైతులు పొలాల్లోకి రాత్రిపూట వెళ్లకూడదని కోరారు. అర్తాం నుంచి కళ్లికోట, దుగ్గి, గుణానుపురం వెళ్లే రహదారిపై ప్రయాణిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది కోరుతున్నారు.

డ్రైవర్ల మధ్య ఘర్షణ: నిలిచిన ట్రాఫిక్


రోడ్డు మధ్యలో ఆర్టీసీ బస్సులు, ఘర్షణ పడుతున్న డ్రైవర్లు


ప్రధాన రహదారిలో నిలిచిపోయిన ట్రాఫిక్

పాలకొండ: ఇద్దరు ఆర్టీసీ డ్రైవర్ల మధ్య ఘర్షణ తలెత్తడంతో పట్టణంలోని ప్రధాన రహదారిలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం నుంచి పాలకొండ వస్తున్న శ్రీకాకుళం-2 డిపో ఆర్టీసీ బస్సు, పాలకొండ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న పాకొండ డిపోకు చెందిన బస్సు సోమవారం ఉదయం ఏలాం సమీపంలో ప్రధాన రహదారిపై క్రాస్ చేసే సమయంలో రెండు బస్సులు ఒకదానికి ఒకటి తగిలాయి. దీంతో ఇద్దరు డ్రైవర్లు బస్సు దిగి తప్పు నీది అంటే నీది అంటూ తోసుకున్నారు. అంతటితో ఆగకుండా బస్సులు తీయకుండా రోడ్డు మీదనే ఉంచి ఘర్షణ పడ్డారు. ఆ సమయంలో కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇద్దరు డ్రైవర్లను స్థానికులు మందలించి బస్సులు తీయించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


హారిక

బొబ్బిలి: భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా ఫ్లోర్ క్లీనింగ్ కెమికల్ తాగేసి ఆత్మహత్యా యత్నం చేసిన పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన గెంబలి హారిక (33) మృతి చెందింది. ఈనెల 13న ఆమె కెమికల్ తాగగా బంధువులు విశాఖ కేజీహెచ్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

భర్తే హంతకుడు

- వీడిన వివాహిత అనుమానాస్పద మృతి మిస్టరీ
- వెల్లడించిన డీఎస్పీ, సీఐ


గౌరీశ్వరి (ఫైల్)


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ పుల్లూరు శ్రీధర్, సీఐ నాగేశ్వర రావు

బొబ్బిలి: మండలంలోని పారాదిలో ఆదివారం ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనలో భర్తే హంతకుడిగా పోలీసుల విచారణలో వెల్లడైంది. దీనికి సంబంధించిన వివరాలను డీఎస్పీ పుల్లూరు శ్రీధర్, సీఐ ఎం నాగేశ్వర రావులు సోమవారం సాయంత్రం విలేకరులకు వివరించారు. బాడంగి మండలం డొంకిన వలసకు చెందిన పూడి శంకర రావు కుమార్తె గౌరీశ్వరి అలియాస్ విజయను పారాది గ్రామానికి చెందిన సూర్రెడ్డి రవికి ఇచ్చి 11 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వీరు టీ కొట్టు నడుపుతూ జీవిస్తున్నారు. వారికి 9, 10 సంవత్సరాల వయసు గల కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్నాళ్లుగా రవి వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయమై గౌరీశ్వరి తరచూ భర్తతో గొడవ పడుతుండేది. ఆదివారం కూడా వీరిద్దరూ వారి దుకాణం వద్దే తీవ్రంగా గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో గౌరీశ్వరి తండ్రి శంకరరావుకు ఫోన్ చేసి భర్తతో వేగలేకపోతున్నానని, పరిస్థితి బాగాలేదు రమ్మని సమాచారమిచ్చింది.

తండ్రి కళ్లముందే మృతి చెందిన కుమార్తె

వెంటనే శంకరరావు కుమార్తె ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో భార్యాభర్తలు గొడవ పడుతుంటే శంకరరావు వారిని సముదాయిస్తూ, పరిష్కారం కోసం ప్రయత్నిస్తుండగానే రవి గౌరీశ్వరిని చెక్కపేడుతో మొఖం, మెడపై తీవ్రంగా కొట్టడంతో ఆమె పక్కనే ఉన్న మంచంపై రక్తం కక్కుకుంటూ ప్రాణాలు విడిచింది. అనంతరం ఆమె చనిపోయిందని తెలుసుకున్న రవికుమార్ గ్రామం పక్కనే ఉన్న హైస్కూల్‌లో దాక్కున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు రవిని పట్టుకుని స్టేషన్‌కు తరలించి, గౌరీశ్వరి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సీఐ ఎం.నాగేశ్వర రావు, సిబ్బంది విచారణలో గౌరీశ్వరిని భర్త ఉద్దేశపూర్వకంగా హత్య చేసినట్లు వెల్లడైందని డీఎస్పీ తెలిపారు. నిందితుడు భర్త రవిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని. సోమవారం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. సీఐ ఎం.నాగేశ్వర రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక


ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న నగర డిప్యూటీ మేయర్ శ్రావణి, సెట్విజ్ సీఈఓ

విజయనగరం: విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణిస్తే విద్య, ఉద్యోగపరంగా భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఏ అంశంలోనైనా గెలుపోటములు సహజమని..ఓడిపోయామని కుంగిపోకుండా, విజయం దాసోహమయ్యే వరకూ శ్రమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయిలో జరగనున్న జూనియర్స్, క్యాడెట్ విభాగాల బాల, బాలికల తైక్వాండో పోటీలకు ప్రాతినిధ్యం వహించే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలను సోమవారం స్థానిక కొత్తపేటలోని రాధాకృష్ణ కల్యాణ మంటపం వద్ద ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఇంత వరకూ వచ్చారని.. వారి కష్టాన్ని ఎప్పుడూ మర్చిపోవద్దని హితవు పలికారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ చారి ప్రసాద్ మాట్లాడుతూ రెండు విభాగాల్లో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరుకాగా..జూనియర్స్ విభాగంలో ఉత్తమ ప్రతిభకనబరిచిన క్రీడాకారులు జూలై 1,2 తేదీల్లో చిత్తూరు జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో..క్యాడెట్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు జూలై 15,16 తేదీల్లో విజయనగరం వేదికగా జరగనున్న పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్, వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా పార్లమెంట్ నియోజక వర్గ కార్యదర్శి ముద్దాడ మధు, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, రిఫరీలు గౌతమ్, త్రినాథరావు, షర్మిల, కె.రామకృష్ణలు వ్యవహరించారు.


తలపడుతున్న క్రీడాకారులు